
CHANDRA

# రాయప్రోలు హైమ

కోర్టు టయిమయిపోయింది. వాహనాల చప్పుళ్ళు చేసుకుంటూ కొందరు, వాహనాల వేటలో మరి కొందరు గేటు దగ్గర తొక్కిసలాటలో హడావుడి పడుతున్నారు. నల్లకోటువాళ్ళు, తెల్ల పంచలవాళ్ళు ఇవాళ్టి ప్రొసీడింగ్స్, రేపటి కార్యక్రమాలు గురించి లాబీలు పడుతూ ఆవరణలో అక్కడా అక్కడా చెట్ల క్రింద నిలబడి ఉన్నారు.

అడిషనల్ సెషన్స్ కోర్టు జడ్జి శ్రీమతి లలితా దేవి డవాలా బంట్రోతు వెంటరాగా ఆవరణలో అల్లంత దూరాన నిలిపి ఉన్న కారువైపు నడుస్తున్నారు. ఎందుకో ఈ రోజు ఆవిడ ముఖం చిన్నబోయింది.

ముదురు రంగు పట్టుచీరతోనో, లేకపోతే మాంచి ఖరీదయిన సరిగంచు నేత చీర కట్టుకునో, ఫెంగు కప్పుకుని నుదుట అర్ధణాకాసంత బొట్టుతో, అర్థంలు తొణికిసలాడే కాటుక కళ్ళతో. . .ఎప్పుడు చూసినా శ్రావణ మంగళవారం పేరంటం వెళ్ళి వస్తున్న ముత్తయిదువలాగా, నిండుగా, "ఎవరీ ముగురమ్మల మహాలక్ష్మమ్మ" అని చూసేవాళ్ళు అబ్బుర పడేటట్లుగా ఉండే లలితాదేవిగారు ఈనాడు మ్లానవదనంతో కనిపిస్తున్నారు. మవునంగా నడుస్తూ, ప్రక్కకి తొలిగి దారిచ్చి దండాలు పెడుతున్న క్లయింట్స్‌ని తలపంకింపుతో పలకరిస్తూ కారు చేరారు. డ్రైవర్ డోర్ తెరిచి ఒద్దికగా నిలబడ్డాడు.

కారెక్కబోతూ ఒకసారి ఆవరణలోకి చూపు సారించారు లలితాదేవిగారు. వోడిపోయిన కక్షిదారుల ఏడుపు మొహాలు ఎవంత చలింపజేసినా "మనం ఇలాటి భావ సంచలనానికి అతీతులం. . ." అనుకుంటూ కారెక్కి చప్పున కూర్చున్నా. డ్రైవర్ కారు స్టార్ట్ చేశాడు. కదులుతున్న కారులో నుంచి బయటికి చూస్తున్న లలితాదేవి గారి కంటికి గేటు దగ్గరగా నిలబడి ఏవో మాట్లాడు కుంటున్న యువ న్యాయవాది భోలారెడ్డి, అతని క్లయింట్ కాత్యాయిని కనిపించారు. కారు వారిని సమీపించగానే మరోసారి లలితాదేవిగారు కాత్యాయినికేసి పరిశీలనగా చూశారు. సరిగ్గా అదే సమయానికి ఆ అమ్మాయి కళ్ళు కూడా దేవిగారివైపు జాలిగా చూశాయి.

'చెంపకి చారడేసి కళ్ళు. . .సంపెంగ పండు వాయి. . .పిల్ల బంగారుతల్లిమ్మలాగుంది' అనుకున్నా రావిడ కాస్సేపు అడిషనల్ సెషన్స్ జడ్జి మనసు తీసి పక్కన పెట్టి, అచ్చయిన తెలుగింటి అమ్మ మనసుతో!

పిల్లవాడూ బాగానే ఉన్నాడు. మంచి ఉద్యోగం, ఆస్తిపాస్తులు, అందచందాలు, ఇద్దరూ కలిస్తే 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' పోటీల్లో పిల్లాని వరుసగా పదేళ్ళపాటు ఫస్టు ప్రయిజు వీళ్ళే కొట్టేయవచ్చు! కాని ఎలా కలపాలి వీళ్ళని. . . ఎలా. . . .ఎలా. . .

వివాహం సాంఘిక మర్యాదలకి సంబంధించిన విషయం. ఆ ఇరుపక్షాలకూ పూర్ణాంగీకారం కుదిరి "నాతిచరామి" అనుకున్నారా ఇక దానికి అడ్డు లేదు. ఏ పక్షాన రవంత అనంగీకారం ఏర్పడినా అది అలా చిలికి చిలికి గాలి వాన అవులగానే ఉంటుంది. అన్నీ కాకపోయినా కొన్ని కేసుల్లో తీవ్రంగా జటిలమౌతుంది.

డ్రైవర్ కారు మెల్లగా పోనిస్తుండగా లలితాదేవి గారి ఆలోచనలు వేగం పుంజుకున్నాయి. పదేళ్ళ జడ్జి జీవితంలో ఆవిడ ఎన్నో సివిల్, క్రిమినల్ కేసులు చూశారు. కొందరు దుండగులకు కఠిన జైలు శిక్ష విధించారు. మరి కొందర్ని స్వల్ప జరిమానాలతో మందలించారు. కోమ్ములు తిరిగిన లాయర్లు వాదిస్తున్నా, సాక్ష్యాలు చూపి నిరూపిస్తున్నా నిర్దోషుల్ని నిర్దోషులుగానే గ్రహించి వారికి న్యాయం చేకూర్చటంలో ఆవిడ పెట్టింది పేరు.

అందరూ ఆవిడని 'ధర్మదేవత' అంటారు.

"ఏ డేనియల్ కేమ్ టు జడ్జిమెంట్" అని కూడా స్తుతిస్తారు.

అంతటి బుద్ధిశాలి, దీశాలి అయినా ఈ రోజు ఇలా డీలా పడిపోయి ఆలోచిస్తున్నారు.

కాత్యాయినిది చాలా సున్నితమైన సమస్య. వివాహంతో విందుదనం సంతరించుకొని, శ్రీమతి త్వాన్ని పొంది సంఘంలో గొప్ప స్థానాన్ని ఆక్రమించుకోవలసిన అమ్మాయి ప్రాణానికి పెళ్ళి నూరేళ్ళ పంట కాదు, పది జన్మల శాపంగా పరిణమించింది. ఆమె మనసును ఆందోళనకు గురి చేసింది. బ్రతుకు అనిశ్చితంగా మారింది.

దివి మున్నయొక్కటి, ఏడు, పందొమ్మిది వందల డెబ్బై తొమ్మిదన, చి. సౌ. కాత్యాయినిని చి. చంద్రశేఖర్ సన్నాఫ్ లేట్ పరంధామయ్య, వివాహం ఆడడు. అయితే కొడుకు పెళ్ళి అయిన కొద్ది క్షణాలకే పరంధామయ్యగారు గుండెపోటుతో పరలోకం పయనించగా మిగతా కార్యక్రమాలన్నీ హాయిగా వేసుకుని మగ పెళ్ళివారు వెళ్ళిపోయారు. వెళ్ళినవారు ఇక అదే దారిన పట్టి మరి వెనక్కి తిరిగి చూడలేదు. ఈ రోజు. . దివి పదకొండగా ఎనిమిది, పందొమ్మిదివందల ఎనభై రెండు. . . అయినా శ్రీమతి కాత్యాయిని ఇంకా పుట్టింట్లోనే ఉంది. సుఖంగా కాపురం చేసుకుంటూ ఈ పాటికి "ఒకరిద్దరు పిల్లలున్న ఇల్లే ఇల్లా ని తోలి పాటలు పాడుకోవలసిన కాత్యాయిని నా కాపురం నిలబెట్టి నా భర్తతో నన్ను కలపండి మొర్రో అంటూ కోర్టును ఆశ్రయించింది.

పెళ్ళయి రెండేళ్ళయినా భర్త ఆమని కాపురానికి తీసుకుని వెళ్ళలేదు. ఎన్ని ఉత్తరాలు వ్రాసినా, బ్రతిమాలినా లాభం లేకపోతోంది. వాళ్ళు వీళ్ళు చెప్పిన మాటలనిబట్టి తేలిందేమిటయ్యా అంటే ఆమె మామగారు పెళ్ళయిన కొద్ది క్షణాలకే పోయాడు కాబట్టి ఆమెది ఐరిగొట్టు జాతకం అని తేల్చి అతనికి వాళ్ళవాళ్ళు వేరే పెళ్ళి చెయ్య బోతున్నారని ఫిర్యాదు చేసింది. కట్నం పిశాచానికే కాకుండా ఇలాంటి మూఢ విశ్వాసాలకు కూడా ఈ దేశంలో పుట్టిన ఆడది బలయిపోవాలా. . .అని ఆమె తరపున వాదిస్తున్న లాయర్ భోలారెడ్డి కోర్టువారిని నిలదీశాడు. పెళ్ళి హిందూ పెళ్ళి చట్టరీత్యా నేరమని, చంద్రశేఖర్ కాత్యాయినిని ఏలుకుని తీరాలని వాదించాడు. అతని వాదనకి కోర్టువారు కరగిపోయారు. పోనీ అతగాడు ఆ అమ్మాయిని కొంత కాలంపాటు పుట్టింట్లోనే ఉంచదలుచుకుంటే ఆమె పోషణకి ఏదైనా ఏర్పాటు చేయించమని కోరాడు.

భోలారెడ్డి చాలా పటిష్టంగా చేసిన వాదనకు, చూపించిన సాక్ష్యాధారాలకు ఆ రోజే కోర్టులో కాత్యాయిని సమస్య తేలిపోవలసింది. కాని చిన్న తిరకాసు. . .

కాత్యాయినీ చంద్రశేఖర్ల వివాహం ధృవపరుస్తూ, భోలారెడ్డి కోర్టువారి ముందుంచిన ఫోటోలు, ఇరుపక్షాలవారూ అచ్చు వేయించిన శుభలేఖలు చూడగా తీర్పు కాత్యాయినికి అనుకూలంగా వచ్చే లాగనే ఉంది. అతడు ప్రవేశపెట్టిన మొదటి సాక్షి అవధాన్ల వెంకటప్పయ్య సిద్ధాంతి ఘంటా పథంగా తానే ఈ పెళ్ళి జరిపించానని చెప్పాడు. కంచుకంఠంతో తాను చదివిన వివాహ మంత్రాలింకా ఆ కల్యాణ మంటపం పరిసరాలలో ప్రతిధ్వనిస్తూనే ఉండి ఉంటాయన్నాడు. వివాహం ఏడు జన్మల బంధమనే, అతి పవిత్రమయిన ఈ బంధాన్ని విచ్ఛేదన చెయ్యాలనుకునేవాళ్ళకి కళ్ళు కాళ్ళు ఉండవనీ వక్కాణించాడు. నూరు కళ్లలాడి ఒక ఇల్లు నిల్పమన్నారు కాని, ఇదేంబుద్ధి అంటూ చంద్రశేఖర్ తరపున వాదిస్తున్న ముసలి లాయర్ సున్న తేజేశ్వరరావు వైపు తిరిగి 'ఛీ' అని చీత్కరించాడు.

ఆయనగారి వాగ్ధాటికీ, అడిగినవాటికీ అడగని వాటికీ కూడా ఆయన ఇచ్చిన జవాబులకూ కోర్టు హాలంతా దద్దరిల్లిపోగా తన పని పూర్తయిందను కుంటూ విజయగర్వంతో తాపీగా సవరించు కుంటూ బోను దిగాడు ఆయన.

ఇంక రెండవ సాక్షి శ్రీమతి చిపుకుల శ్రీలక్ష్మమ్మ. ఆవిడ పెళ్ళి కూతురి మేనత్త. కాత్యాయినీ చంద్రశేఖర్ల వివాహంలో ఆవిడే పెద్ద ముత్తయిదు వగా వ్యవహరించింది. అమ్మాయిని గౌరితపస్సుకి కూర్చుండ చేసి ఆమె చేతిలో కొబ్బరి బోండం తానే ఉంచింది. జ్యోతుల పళ్లెరం చేత పట్టుకొని పెళ్ళి కూతురు వివాహ మంటపం ప్రవేశించే టప్పుడు శ్రీలక్ష్మమ్మగారు అమ్మాయిని

స్వయంగా జబ్బ పట్టుకుని తీసుకుని వచ్చినట్లు భోలారెడ్డి చూపించిన ఫోటో నిర్ధారిస్తూంది.

ఎటొచ్చీ ఈ పెళ్ళి మీ చేతుల మీదుగానే జరిపించారు కదమ్మా' అని భోలారెడ్డి వేసిన చివరి ప్రశ్నకి ఆవిడ అనాలోచితంగా ఇచ్చిన సమాధానం కథని తారుమారు చేసింది.

"నిస్సంకోచంగా జరిపించాను, బాబూ!" నా చేతితో పిల్లకి పెళ్ళి బొట్టు పెట్టాను. నా చేతులతో పిల్లని బుట్టలో కూర్చోబెట్టాను. ఆఖరికి సూత్రధారణకి వీలుగా నా చేతితోనే పిల్ల పూల జడ ఎత్తి పట్టుకున్నాను. క్షణం మనది కాదంటారు చూశారా. . .నా చేతితో తొలి అక్షింతలు కూడా దంపతుల శిరస్సుల మీద ఉంచాలని ఉబలాట పడ్డాను. పిల్లవాడు మొదటి ముడి వెయ్యగానే ఒక చేతితో పిల్ల పూల జడ పట్టుకుని రెండో చేతితో అక్షతలు అందుకుని సిద్ధంగా ఉన్నాను. అబ్బాయి ఇంకా రెండోముడి వేసి వెయ్యకుండానే జనంలో ఏదో గోల బయల్దేరింది. అటు చూద్దాం కదా! పందిట్లో ముందు వరుసలో కూర్చున్న వరం ధామ్మయ్యగారు అమాంతం విరుచుకుపడిపోయారు. జనం ఆయన చుట్టూ చేరిపోయారు. మూడో ముడి వెయ్యకుండానే పెళ్ళి కొడుకు తండ్రి దగ్గరకు పరుగెత్తాడు. నేనూ కంగారుగా అటు వెళ్ళాను. ఇంతలో ఇలా అయిపోయింది. పాపం పట్టు చీర కట్టుకుని గంపెడు నగలు పెట్టుకుని కొడుకు పెళ్ళికి తరలివచ్చిన మహాలక్ష్మిలా ఉండే బుచ్చిలక్ష్మి అక్కయ్యకి ఇంతలోనే ఇంత గతి పట్టింది.'''

కళ్ళు తుడుచుకుంటూ శ్రీలక్ష్మమ్మ బోను దిగబోయింది.

"యువరానర్! ఈ సాక్షిని ప్రశ్నించేందుకు అనుమతించండి" అంటూ డిఫెన్స్ న్యాయవాది కోర్టువారిని కోరడం, కోర్టువారు అనుమతించడం జరిగాయి. శ్రీలక్ష్మమ్మ దిగబోతున్న బోను మళ్ళీ ఎక్కింది.

చంద్రశేఖర్ తరఫున వాదించడానికి పూనుకున్న నమ్మితేశ్వరరావు బట్టతల వెనక నలభై ఏళ్ళ అనుభవం ఉంది. తనకు తానుగా ఆయనేమీ కష్టపడడు. అవతలి పక్షంలో నుంచే తనకి అనుకూలమైన పాయింటేదో దొరకబుచ్చుకుని, వాదించి వాదించి, పిండి పిప్పి చేసి విజయం సాధిస్తాడు. భోలారెడ్డి ఇప్పటిదాకా గొంతు చించుకుంటుంటే ఉలుకూపలుకూ లేకుండా కూర్చున్నవాడు— ఇప్పు డీ పెద్ద ముత్తయిదువ ప్రశ్నిస్తానంటున్నాడు. ఏం గొడవ తెచ్చిపెడతాడో నని కోర్టంతా చెవులు రిక్కించి విన్నారు.

"అమ్మా! మీ పేరు. . ."

"చివుకుల శ్రీలక్ష్మమ్మండి, బాబు!"

"మీ పెళ్ళి ఎప్పుడయింది?"

"అప్పే నలభయ్యేళ్ళ నాటి మాట. ఆ తారీఖులు నాకు గుర్తు లేవు కాని, నా పెళ్ళి వైశాఖ బహుళ ఏకాదశినాడు అయిందన్నది మాత్రం గుర్తే, బాబూ!"

"మీవారేం చేస్తుంటారు?"

"హెడ్మాస్టరీ చేసి రిటైరయి తీరుబడిగా కూర్చుని భోజనం చేస్తుంటారు, బాబూ!"

కోర్టంతా నవ్వారు. నమ్మితేశ్వరరావు మొహం కొంచెం రంగు మారింది కాని, బింకం సడలలేదు.

"నలభై ఏళ్ళనాడు జరిగిన మీ పెళ్ళి వైశాఖ బహుళ ఏకాదశి అని గుర్తుపెట్టుకున్నారు కదా! మరి ఆ పెళ్ళిలో జరిగిన పెళ్ళి తంతు కూడా మీకు గుర్తుండాలి. . .అవునా?"

"పెళ్ళిలో జరిగిందా. . .పెళ్ళి తర్వాత జరిగిందా, బాబు!"

మళ్ళీ కోర్టంతా పకపకలు ప్రతిధ్వనించాయి. శ్రీలక్ష్మమ్మ అమాయకంగా సిగ్గుపడింది. నమ్మితేశ్వరరావు మండిపడ్డాడు.

"ఆర్డర్! ఆర్డర్!" కోర్టువారు గద్దించారు.

"పెళ్ళిలో జరిగిన విషయాలు చెప్పండి— చాలు! మీ పెళ్ళికి మిమ్మల్ని పెళ్ళి కూతుర్ని చేసింది మొదలు పెళ్ళి తంతు ముగిసేవరకూ పురోహితులు, పెళ్ళి పెద్దలు ఏం చేశారు? మీ పెనిమిటిచేత ఏం చేయించారు. గుర్తు తెచ్చుకుని చెప్పండి."

"గుర్తు తెచ్చుకోవడం ఏమిటి, బాబూ! ఆనాటి




A PRODUCT OF ap ajanta pharma pvt. ltd. Worli, Bombay-400025.
INNOVATION/AP/TEL/02-A




వైభవం కళ్ళకి కట్టినట్లు ఇప్పటికీ కని పిస్తుందేమో" అన్నారావిడ తన్మయత్వభావంతో.

"అదే. చెప్పండి."

"ఎన్ను పెళ్ళి కూతుర్ని చేసి పేరంటాళ్ళు వసువు దంచారండి. పెళ్ళి ముందు మంగళ స్నానాలు చేయించారు. ఆ తర్వాత. . .మా పెళ్ళి అర్ధరాత్రి అయిందిలెండి. . . అందుకని బాగా పొద్దుపోయాక వన్ను గౌరీ పూజకి కూర్చో బెట్టారు. . .ఆ తర్వాత. . .ఆ తర్వాత. . .మావారు నా మెడలో మూడు ముళ్ళూ వేశారు. ఇహ. . . తలంబ్రాలు, నాగవల్లి, అరుంధతి దర్శనం. . . బంతులాట. . .శోభనం. . ."

ఆపకుండా చెప్పుకుపోతున్నారు శ్రీలక్ష్మమ్మగారు. అడ్డుతగిలాడు వన్నతేశ్వరరావు.

"చూడండమ్మా! మరొక్కసారి చెప్పండి! మీవారు మీ మెడలో మూడు ముళ్ళూ వేశారా?" విలదీశాడు వన్నతేశ్వరరావు.

తడుంకోలేదు శ్రీలక్ష్మమ్మ.

"అదేమిటి బాబు! అలా అడుగుతారు? ఆనాడు వారు నా మెడలో వసుపుతాడుతో వేసిన ఆ మూడు ముళ్ళ గట్టితనంవల్లనే కదా. . .మా దాంపత్యం చెక్కు చెదరకుండా ఈనాటికీ ఇలా నిలబడింది. అసలు పెళ్ళంటే మూడు ముళ్ళు, ఏడడుగులు కదా! మూడు ముళ్ళు వెయ్యని పెళ్ళి పెళ్ళే. . .నా. . .ఆ.అ. . ." సగంలో ఏదో గుర్తొచ్చినట్లు బెంబేలు పడిపోయింది శ్రీలక్ష్మమ్మ.

"ఆగిపోయారేం, చెప్పండి! పెళ్ళంటే మూడు ముళ్ళంటున్నారు! మరి మీ మేనకోడలు శ్రీమతినని చెప్పుకుంటున్న కుమారి కాత్యాయని మెడలో మూడు ముళ్ళూ పడ్డాయా?"

వన్నతేశ్వరరావు వాదిస్తుంటే నిరుత్తరంగా నిలబడిరది శ్రీలక్ష్మమ్మ. "నోట్ దట్ పాయింట్, మిలార్డ్!" తన వాదనకు ఉపక్రమిస్తూ భోలారెడ్డికేసి గర్వంగా చూశాడు.

"మనం సంఘజీవులం. మన కట్టుబాట్లు అతిక్రమించి మనుగడ సాగించలేం. అందుకే వివాహమనేది గోప్యంగా జరగడానికి లేదని పదిమంది సమక్షంలో జరిపిస్తాం. ఖర్చు అను కుంటూనే బంధుమిత్రుల్ని ఆహ్వానిస్తాం.. విందులు, వినోదాలు చేస్తాం! కారణం. . ఇదిగో ఇలాంటి అవకతవకలేర్పడినప్పుడు నిలబడి సాక్ష్యం పలికి విడిపోయే జంటలను కలుపుతారనీ, ఇదిగో ఇలాంటి గడుసరి ఆడవాళ్ళబారి నుంచి చంద్ర శేఖర్‌లాంటి అమాయకుల్ని రక్షిస్తారని. హిందూ వివాహానికి రిజిస్ట్రేషన్లుండదు. సర్టిఫికేట్లూ ఉండవు. అసలిలాంటి విషయాలు కోర్టుదాకా రావు. అథవా వచ్చినా న్యాయం నిర్ణయించేందుకు మనకు లభించే సాక్ష్యాధారాలు పెళ్ళి చేయించిన పురోహితులు, పెళ్ళి పెద్దలూను. మరి అవధాన్ల వెంకటప్పయ్యగారి సిద్ధాంతం— నూరు కల్లలాడి ఒక ఇల్లు నిలపాలనిట. అనువైన ఒక్క అబద్ధంతోనే ఆయన అమాయకుడైన నా క్లయింట్ చంద్రశేఖర్‌ని ఇరుకున పడేశారు.

ఇహ, మిగిలిన ముఖ్య సాక్షి శ్రీమతి చిదుకుల శ్రీలక్ష్మమ్మగారే స్వయంగా పెళ్ళంటే మూడు ముళ్ళంటున్నారు. ఆవిడ నోటితో ఆవిడే కాత్యాయని మెడలో మూడు ముళ్ళు పడ లేదంటున్నారు. మూడు ముళ్ళు పడని పెళ్ళి పెళ్ళవుతూరా?

"నా క్లయింటు చంద్రశేఖరం ఎర్రగాబుర్రగా ఉన్నాడు కాబట్టి. . .ఆలవితో తన కిదివరకే వివాహం కుదిరింది కాబట్టి అసలు పెళ్ళి ఆవకపోయినా, అయినట్లు, దొంగ దాఖలాలు సృష్టించి అతిన్ని నవ్వులపాలు చేసిన కుమారి కాత్యాయని మీద చర్య తీసుకోవాలి! అతగాడు మూడు ముళ్ళు వెయ్యని అమ్మాయిని అతడెందుకు ఏలుకోవాలి! అసలు పెళ్ళికి ముక్కెన్ని? . . . ముక్కెన్ని?"

• • • •

ఆనాటి విచారణలో చివరి ఘట్టం గుర్తు చేసుకుంటూ అప్రయత్నంగా తన మెడలోని మంగళసూత్రాల తాడు తడుముకున్నారు శ్రీమతి లలితాదేవిగారు. అంతలోనే 'బంగారు నాను తాడుకి మళ్ళీ ఉంటాయి' అనుకుని సంతృప్తిగా నూపిరి తీసుకున్నారు.

కారు బంగళా ముందు ఆగింది. డ్రైవర్ మళ్ళీ భయభక్తులతో డోర్ తెరిచాడు. ఇంతసేపూ కాత్యాయని సమస్య పరిష్కారం ఆలోచిస్తూ కార్లో కూర్చున్న జడ్జి లలితాదేవిలో నుంచి ఒక భారత స్త్రీ, లలితాదేవి ఆత్రుతతో కూడిన మనసుతో కార్లు దిగి బంగ్లావైపు నడిచింది. అన్యమనస్కంగానే గడపలో అడుగు పెట్టారు లలితాదేవిగారు. హాల్లో సోఫాలో కూర్చుని ఇంగ్లీషు మాగజైను తిరగేస్తున్న భర్త శ్రీపతిశాస్త్రి ప్రక్కన కూలబడ్డారు. కూలబడుతూనే భర్తని ప్రశ్నించారు.

"ఏమండీ! మన పెళ్ళిలో జరిగిన తంతు మీకు పూర్తిగా గుర్తుందా?"

ఆయాసపడుతూ కంగారుపడుతూన్న భార్యని చూస్తే ఆవిడని కాస్సేపు సరదాగా ఇబ్బంది పెట్టాలని కొంటె కోర్కె కలిగిందాయనకు. అర్థవంతంగా కనుబొమలు పైకి ఎగరవేశారు.

"అది కాదండీ! చిక్కు సమస్యకు ఒకదానికి మీ జవాబువల్ల పరిష్కారం దొరుకుతుందేమోనని!" అయ్యర్ అందించిన హార్లిక్స్ సిప్ చేస్తూ భర్తకేసి అర్థింపుగా చూశారావిడ.


ఆవిడ మొహం చూస్తుంటే మరిహ కొంటెగా నవ్వాలనిపించాలేదాయనకి. ఆవిడ నిజంగానే ఏదో ఇబ్బందికరమైన సమస్యకు పరిష్కారం ఆలోచిస్తున్నారు, ఏమిటన్నట్లు చూశారావిడకేసి.

"మన పెళ్ళిలో తంతు సవ్యంగా జరిగిందా! మీరు నా మెడలో సరిగ్గా మూడు ముళ్ళ వేశారా?". . .ఆవిడింకా ఏవేవో అడిగేవారే కానీ ఈసారి శ్రీపతిశాస్త్రిగారు పగలబడినవ్వారు. నవ్వారు. . .నవ్వారు. . .ఇక నవ్వలేక ఆగిపోతూ, నిర్విణ్ణురాలైన భార్యకేసి చూశారు. తమా యించుకున్నారు.

"పిచ్చిదానా. . .మనం ఈ రోజుకి ముప్పై ఏళ్ళ నుంచి దంపతులుగా చలామణి అవుతున్నాం. కన్న ముగ్గురు సంతానానికీ మూడుముళ్ళ బంధం ఏర్పాటు చేసేశాక. . .ఇప్పుడు నీకు నేను మూడు ముళ్ళు. . ."

"ఏమండీ! ఆగండి." ఏదో బాధాకరమైన విషయం గుర్తొచ్చినదానిలా భర్తకి అడ్డు తగిలారు లలితాదేవిగారు.

"మనల్నాయి పెళ్ళిలో జాగ్రత్తగా కోడలి మెళ్ళో రెండు పుస్తెలు కట్టించేం కదా! మన శారద నీరదల పెళ్ళిళ్ళు జంటగా చేశాం., వివాహపు తంతులో ఏం లోపాలు జరిగేయో, ఏమో?" నీర సంగా తల పట్టుకుంటూ హార్లిక్స్ కప్పు టీపాయ్ మీద పెట్టారు లలితాదేవి. శ్రీపతి శాస్త్రిగారికి ఇది జోకులు వేసే సమయం కాదని అర్థం




అయింది.

"చూడు, లలితా! నువ్వు బాధ్యత గల న్యాయాధికారిని, కోర్టుకు లక్ష రకాల కేసులొస్తుంటాయి. భర్త భార్యని చంపిన కేసు. భార్య భర్త కంట్లో కారం కొట్టిన కేసు. విడాకుల కేసులు, ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు అవన్నీ మనకు అనువర్తింపచేసుకోవడం, బాధపడటం అలా మన జీవితం కూడా జరుగుతుందేమోనని బాధపడటం సామాన్యుల పని. నీ వంటి జడ్జికి తగినది కాదు. కోర్టు సమస్యలు న్యాయశాస్త్ర పరిశీలనవల్ల పరిష్కారం కావాలి. కాని నా బోటి వాడి సలహా సంప్రదింపుల వల్ల కాదు. అయినా, లలితా: రిటైరయి ఇంట్లో కూర్చున్న ఇంగ్లీషు ప్రొఫెసర్ని కాబట్టి, ఏ వేమన పద్యాలో ఇంగ్లీషు లోకి అనువదించట మంటే అనువదిస్తా కాని ఇలాంటి..."

"చాల్లెండి. కోర్టు గొడవలకి మిమ్మల్ని సలహా అడిగేదాన్నేనా నేను? ఏదో కథలో సంగతి గుర్తొచ్చి అడిగానంతే. ఇహ లేచి స్నానం చెయ్యండి. రాత్రి మనం చైర్మన్ భాస్కరమూర్తి గారమ్మాయి పెళ్ళికి వెళ్ళాలి."

భర్త వేళాకోళాలకి దొరికిపోయినందుకు సిగ్గుపడుతూ మాటలు దాటవేసి ఆయన దృష్టి మరో దిక్కుకి మళ్ళిస్తూ, కాస్సేపు విశ్రాంతి తీసుకోవడానికి బెడ్‌రూం కేసి నడిచా రావిడ.

• • • •

మరునాటి రోజు కోర్టులో విచారణ చంద్రశేఖర్ మీద సాగింది. భార్యని కాపురానికి తీసుకెళ్ళని నిందితునిగా అతన్ని బోనెక్కించాడు లాయర్ భోలారెడ్డి.

"మీ పెళ్ళి జరిగిన కొద్ది క్షణాలకే మీ తండ్రి గారు పోయారన్న నెపంతో చదువుకున్న మీరు కూడా శ్రీమతి కాత్యాయినిది శని గొట్టు పాద మని నమ్మి ఆమెను వదిలేశారా?"

చంద్రశేఖర్ తికమక పడ్డాడు. ఈ మూఢ విశ్వాసాలకీ విద్యాధిక్యతకీ పొంతన కుదరదు. కాబట్టి తను గుడ్డి నమ్మకాలున్న మూర్ఖుడు కాదని నిరూపించుకోవాలి.

"కాదండీ! నా కలాంటి గుడ్డి నమ్మకాలేం లేవు."

"మరి మీరెందుకు మీ భార్యని వదిలేశారు?"

"ఆమె నా భార్య కాదు. మా కసలు పెళ్ళి కాలేదు."

"పోనీ పెళ్ళి తంతుపూర్తి కాలేదు. కాని వివాహ మండపంలో మీ రిద్దరూ పీటల మీద కూర్చునే దాకా వచ్చింది కదా!"

"కాని ఆ తరవాత నేనా మాట విత్‌డ్రా చేసుకున్నాను."

"ఎందుకని?" సూటిగా ప్రశ్నించాడు భోలారెడ్డి.

చంద్రశేఖర్ అంత సూటిగానూ జవాబిచ్చాడు. "ఈ సంబంధం ఖాయం చెయ్యడానికి ముందు మా నాన్నగారు నతో ఏమీ సంప్రదించలేదు. పెద్దాయన మాట కాదనలేక పెళ్ళి పీటల దాకా వచ్చేను. ఇప్పుడాయన ఎలాగూ పోయారు కాబట్టి నా జీవిత భాగస్వామి కాబోయే అమ్మాయిని నా కళ్ళతోనే చూసి నచ్చాకనే చేసుకుందామని ఈ సంబంధం వదులుకున్నాను."

"అయితే మీరు శ్రీమతి కాత్యాయినిని పీటల మీద తప్ప ముందెక్కడా చూడ్లేదన్నమాట?"

"అసలు లేదండీ! పీటల మీద కూడా నా నామె మొహం చూడ్లేదు." తడబడ్డాడు చంద్రశేఖర్. "మా నాన్నగారు కనీస మర్యాదగా నైనా పెళ్ళి చూపులు ఏర్పాటు చెయ్యలేదు." జీరపోయిన దతని కంఠం పెద్దల నిరంకుశత్వానికి నిరసనగా.

"అలాగా! పోనీ ఇప్పుడు చూడండి!"

కోర్టు హాలులో కూర్చున్న కాత్యాయిని మీదికి శేఖర్ దృష్టి మళ్ళించాడు భోలారెడ్డి.

కళ్ళు అప్రయత్నంగా కలుసుకున్నాయి. మనసులు మూగగా ఏవేవో ఊసులు చెప్పుకున్నాయి. పెదాల జంటల కొసల నుంచి చిరునవ్వులతో కూడిన

4—5—83

చిరునవ్వులు వెలువడ్డాయి. భోలారెడ్డి సమయం కనిపెట్టాడు!

"ఏం? అమ్మాయి అందంగా లేదా!" సూటిగా అడిగాడు.

సిగ్గుతో తలవొంచుకున్న కాత్యాయిని ముగ్ధ మోహన రూపాన్నుంచి చూపులు మళ్ళించుకోలేక పోయాడు శేఖర్!

"చాలా అందంగా ఉంది! సింప్లీ బ్యూటీ ఫుల్!" ఉన్మాదంలా భావంతో, అరమోడ్పు కన్నులతో తనుకోర్టులో కేసులో ఉన్నాడన్న సంగతె మరచి పోయి అన్నాడు.

"దటాల్ యువరానర్" అందుకున్నాడు భోలారెడ్డి.

"నా క్లయింటు శ్రీమతి కాత్యాయిని మీద ఆమె భర్త శ్రీచంద్రశేఖర్ కి ఇష్టంలేకపోలేదు. ఆమె అందచందాల పట్ల అతనికి అసంతృప్తి లేదు. ఏటొచ్చీ మూఢ నమ్మకాలతో కుళ్ళిపోతున్న మన సమాజంలోని కొందరు పెద్దమనుషులు ఇలాంటి అమాయకుల్ని ఎక్స్‌ప్లాయిట్ చేసి దంపతుల్ని విడదీస్తున్నారు. కాపురాలు కూలదోస్తున్నారు."

కోర్టువారు పాయింట్ నోట్ చేసుకున్నారు.

భోలారెడ్డి ఇక లాయర్ సన్నుతేశ్వరరావు గారిని ఎదుర్కోవడానికి సిద్ధమయ్యాడు.

"సన్నుతేశ్వరరావుగారూ! మాన్ ఈజె సోషల్ యానిమల్ అంటే అర్థం ఏమిటి?

"మనిషి సంఘ పశువు."

కోర్టులో నవ్వులు.

"గొప్పగా చెప్పారు! వివేక హీనం పశుః అని మన పెద్దలు చెప్పనే చెప్పారు! అయితే ఈ సంఘ పశువు' కొన్ని సాంఘిక మర్యాదలకి కట్టుబడి పిలిస్తే లేకపోయినా స్నేహితుల ఇళ్ళల్లో జరిగే వివాహాది శుభ కార్యాలకు హాజరవుతూ ఉండాలి కదా!"

"కదా మరి. ఆరోగ్యం బాగుండకపోయినా హాజరవ్వాల్సిందే! నిన్న రాత్రి జలుబు, దగ్గు, రొంపలతో బాధపడుతున్నాను. అయినా చైర్మన్‌గారి అమ్మాయి పెళ్ళికి హాజరయ్యాను!

"హాజరయ్యారు సరే..." భోలారెడ్డి క్రాస్ చెయ్యబోతుంటే సన్నుతేశ్వరరావు అడ్డు తగిలాడు.

"అంతేకాదు! నా విరోధులే నా మీద ఏ దోపిడికి కేసో బనాయిస్తే నీ వాక్చాతుర్యంతో వాళ్ళని గెలిపించి నన్ను జైలుపాలు చేసినా చేస్తావని ఎలిబీ కోసం పడుంటుందని నిన్ను కూడా నా వెంట తీసుకెళ్ళాడు."

కోర్టంతా గొల్లుమన్నారు. భోలారెడ్డి నవ్వాడు.

కోర్టువారు "ఆర్డర్ ఆర్డర్" అంటూ సుత్తి కొట్టారు.

"మీ దగ్గర నేను జూనియర్ లాయర్‌గా పనిచేసి తర్వ లేదుగా! కాబట్టి పచ్చి అబద్ధాన్ని పచ్చి నిజంగా చూపించలేను లెండి. మీరు ఎలిబి పెట్టుక్కో వక్కరలేదు."

మళ్ళీ నవ్వులు.

"పాతే నగరు పెళ్ళికి నన్ను తీసుకుని వెళ్ళడానికి

గల కారణం వేరే ఉంది. కారు లేదు. నా కారులో నాతో పాటే పెళ్ళికి బయల్దేరి...'' ఇంకా ఏదో చెప్ప బోయాడు భోలారెడ్డి.

''కారు కొనేపాటి డబ్బు సంపాదించేటంతటి కల్లలాడే తెలివి నాకు లేదు, నాయనా!''

ఈసారి నవ్వు చల్లారేసరికి మూడు నిముషాలు పట్టింది.

''సరే! మనం రాత్రి ఛైర్మన్ గారమ్మాయి పెళ్ళికి వెళ్ళాం. అక్కడ మనం ఏం చేశాం! ఏం చూశాం? ఎన్నింటికి ఇంటి ముఖం పట్టాం?''

''ఏం చేశాం! అదేం ప్రశ్నయ్యా! అక్కడ మనమేం చేస్తాం! నువ్వూ, నేనూ తలంబ్రాలూ పోసుకుంటామా?''

మళ్ళీ కలకలలు, కిలకిలలు.

''వెళ్ళాం. కూర్చున్నాం. స్నేహితులు కన్పించారు. పలకరించాం! పెళ్ళివారు డ్రింకులిచ్చారు. సేవించాం. అక్షతలిచ్చారు. అందుకున్నాం! సుముహూర్తం కాగానే పెళ్ళయిందనిపించి దంపతుల మీద అక్షతలు వేసి ఆశీస్సులందించి ఇంటికి వచ్చేశాం. నీ కార్లోనే నువ్వే డ్రైవ్ చేస్తూ నన్ను మా ఇంటి ముందు దింపావు.''

''అది సరే! సుముహూర్తం అంటున్నారు సరిగ్గా ఎన్ని గంటలకో చెప్పగలరా!''

భోలారెడ్డి సన్నుతేశ్వరరావుగారి సీనియారిటీని గౌరవిస్తూ మీరు మీరని మాట్లాడతాడు. ఆయ నేమో కుర్ర లాయర్ని బహువచనంలో ఏం సంబోధిస్తాం అని అతన్ని ''నువ్వు'' అంటారు.

''నువ్విలాంటి తిరకాసేదో పెడతావనే నేనన్ని గుర్తు పెట్టుకున్నాను సుముహూర్తం సరిగా తొమ్మిది గంటల ముప్ఫయి నిముషాలకి.''

కొంచెంసేపు భోలారెడ్డి ఏం మాట్లాడలేదు. సన్నుతేశ్వరరావు మళ్ళీ అందుకున్నారు.

''భోరున వాన ఈదురు గాలి. నా కసలే ఇజ్నోఫీలియా ఉంది! లగ్నం అంత నడిరయ సరికి చాలా టైము పడుతుందని సుముహూర్త ఘడియలో వధూవరులిద్దరూ ఒకరి శిరస్సు మీద ఒకరు జీలకర్ర, బెల్లం ఉంచగానే మనం అక్షతలువేసి చదివింపులకి చాలా సమయం ఉంది కాబట్టి బహుమతులు అమ్మాయి చేతికి మనమే అందించేసి మనం తిరుగు ముఖం పట్టాం.''

''ఆగండి.'' గర్జించాడు భోలారెడ్డి. ''జీలకర్ర —బెల్లం తరవాత పెళ్ళయిందనిపించి అంటున్నారు అయితే హిందూ వివాహంలో సూత్రధారణను ప్రాముఖ్యత తక్కువేనన్న మాట.''

సన్నుతేశ్వరరావుకి పచ్చి వెలక్కాయ గొంతున పడింది.

''యువరానర్! మూడు ముళ్ళు పడని పెళ్ళి పెళ్ళే కాదం వాదించిన ఈ పెద్ద మనిషి సుముహూర్తం అంటే సూత్రధారణ కాదనీ, జీలకర్ర బెల్లం ఇవ్వడేనని ఒప్పుకుంటున్నారు. మనం వైదిక విధిని జరిగే హిందూ వివాహాలు అనేకం చూసి ఉన్నాము. శుభలేఖలో చెప్పబడిన ముహూర్త సమయానికి జరిగేది జీలకర్ర బెల్లం మార్పిడి.''

కోర్టు వారు నోట్ చేసుకున్నారు.

మూడవ సాక్షి పేరు పురోహితుడు. ఘనపాటి శ్రీ ఆకెళ్ళ సుబ్రహ్మణ్యసోమయాజి. వైదికంగా జరిగే వివాహాల తంతు విశదీకరించారు. తెలుగునాట మూడు ముళ్ళు, బెంగాల్‌లో పాపిట సిందూరం మహారాష్ట్రలో నల్లపూసల కుత్తిగంటు ధరింప జెయ్యటం ఇలా ఒక్కో ప్రాంతంలో ఒక్కో ఆచారం అమలులో ఉన్నా వ్యాప్తంగా అమలులో ఉండి ''వధూవరుల్ని'' ఏకం చేసేది జీలకర్ర బెల్లం'' సన్నివేశమని ధ్రువపరిచారు.

భోలారెడ్డి కాత్యాయనీ, చంద్రశేఖర్ల ఫోటో కోర్టు వారి ముందుంచుతూ ''జీలకర్ర —బెల్లం' ఘట్టం తాలూకు ఫోటో పైన పెట్టాడు.

''వాద ప్రతివాదనలు విని, సాక్ష్యాధారాలు చూసుకుని లోక రివాజు దృష్టిలో పెట్టుకుని న్యాయానికి న్యాయం చేస్తూ కోర్టు వారు కాత్యాయనీ చంద్రశేఖర్లను భార్యాభర్తలుగా కలిసి జీవించమని ఆదేశిస్తూ తీర్పు చదివారు.

ఆనాటి మిగతా ప్రొసీడింగ్స్ కూడా చూసుకుని సాయంకాలం తేలికపడిన మనసుతో, హాసిల దనంతో కారు ఎక్కబోతున్న లలితాదేవిగారి దగ్గరచేరి ''కాత్యాయనీ చంద్రశేఖర్లు ''మేం కలిసి జీవించదల్చుకున్నాం మేడమ్'' అంటూ చేతులు మోడ్చి నిలబడ్డారు. లలితాదేవి గారు ''శుభమస్తు'' అన్నారు. ''శ్రీఘ్రమేవపుత్ర ప్రాప్తిరస్తు''అని ఆశీర్వదించారు. అటు మీదట కాత్యాయని కళ్ళలోకి చూస్తూ వీలు చూసుకుని ఏ గుళ్ళోనో ఆ మూడు ముళ్ళు వేయించేసుకో అమ్మా! అన్నారు అచ్చంగా తెలుగింటి అమ్మలాగ. ★

